
సాక్షి నంద్యాల

గురువారం । 26 । అక్టోబర్ । 2023



సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోక కల్యాణార్థమై బుధవారం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీర భద్ర స్వామికి విశేష పూజలు నిర్వహించారు.



మద్రాస్ కాల్వకు నీరు విడుదల

వెలుగోడు: వీబీఆర్ నుంచి బుధవారం మద్రాస్ కాల్వకు 2 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 7.337 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



మహానందిలో భక్తుల సందడి

మహానంది: మహానందిలో భక్తుల సందడి నెల కొంది. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిం చి మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

28న మహానంది ఆలయం తలుపులు మూసివేత



మహానంది: రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 28వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుంచి మహానంది ఆలయ తలుపులు మూసేస్తున్నట్లు ఆలయ వేదపండి తులు రవిశంకర అవధాని తెలిపారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి బుధవారం విలే కరులతో వేదపండితులు మాట్లాడారు. శని వారం సాయంత్రం కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర, కోదండరామాలయం, వినా యకనంది, గరుడనంది ఆలయాల తలుపులు మూసివేసి తిరిగి 29వ తేదీ ఆదివారం ఉదయం తెరుస్తామన్నారు. ఆలయం శుద్ధి, సంప్రోక్షణ పూజల అనంతరం యథావిధిగా భక్తులకు దర్శనం కల్పిస్తామని వెల్లడించారు.

శ్రీశైలంలో 71.6 టీఎంసీల నీటి నిల్వలు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైల జలాశయంలో బుధ వారం సాయంత్రం సమయానికి 71.5940 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మంగళవారం నుంచి బుధవారం వరకు జలాశయం నుంచి దిగువ ప్రాంతాలకు 5,139 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ముచ్చుమర్రి ఎత్తిపోతలకు 735 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యు లేటరీ ద్వారా 300 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1,510 క్యూసెక్కులు , కల్వ కుర్తి ఎత్తిపోతలకు 2,40 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 845.80 అడుగులకు చేరుకుంది.

ఈ-క్రాప్ బుకింగ్‌పై నేటి నుంచి సామాజిక తనిఖీలు

నంద్యాల(సెంట్రల్): ఖరీఫ్ సీజన్‌కు సంబం ధించి ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి కావడంతో నేటి నుంచి సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5,51,912 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. సాగు చేసిన పంటలను 100 శాతం ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. పంటల నమోదు ముసాయిదా జాబి తాలను సామాజిక తనిఖీల కోసం ఈ నెల 26 నుంచి 29 వరకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రద ర్శిస్తారు. అంతేగాక గ్రామసభలు నిర్వహించి ఈ-క్రాప్ నమోదు వివరాలను చదివి వినిపి స్తారు. పంటల నమోదు వివరాలపై అభ్యంత రాలు ఉంటే ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు రాతపూర్వ కంగా ఇవ్వాలి. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ 100 శాతం పకడ్బందీగా ఉండాలనే ఉద్దేశం తోనే సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు.

ఈవీఎంల పరిశీలన



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

నంద్యాల: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) ప్రథమ స్థాయి పరిశీలనను బుధవారం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నం ద్యాల పట్టణంలోని మార్కెట్ యార్డ్ గోడౌన్‌లో ఈవీఎంలను భద్ర పరిచారు. ప్రస్తుతం ప్రథమ స్థాయి పరిశీలన (ఎఫ్ఎల్‌సీ) జరుగు తుంది. ఈ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 3,003 కంట్రోల్ యూనిట్లు, 5,129 బ్యాలెట్ యూనిట్లు, 4,922 వీవీ ప్యాట్లు ప్రథమ స్థాయి పరిశీలన పూర్తయిందని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన వాటి పరిశీలన ప్రక్రి యను కూడా వచ్చేనెల 10వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సీఈఓకు ఆదేశించారు.

మార్కెట్‌లో ఉల్లి ధరల జోరు

- క్వింటా ధర గరిష్టంగా రూ.4,559

కర్నూలు(అగ్రికల్చర్): ఉల్లి ధరలు జోరుమీద ఉన్నాయి. కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం ఏకంగా రూ.4,559 ధర పలికిం ది. ఈ నెల 21న ఉల్లి ధర గరిష్టంగా రూ.3,596 పలికింది. ఆదివారం నుంచి మంగ ళవారం వరకు మార్కెట్‌కు సెలవులు ఉన్నాయి. బుధవారం మార్కెట్‌లో వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు యథావిధిగా జరి గాయి. కర్నూలు మార్కెట్‌కు 15 మంది రైతులు 348 క్వింటాళ్ల ఉల్లి తెచ్చారు. కనిష్ట ధర రూ.2,519, గరిష్ట ధర రూ. 4,559 లభిం చింది, మోడల్ ధర ఏకంగా రూ.3,739 నమోదైంది. ఈ నెల 21 నాటి ధరలతో పోలిస్తే క్వింటంపై రూ.963 పెరుగుదల ఉంది.

దేవరగట్టులో కర్రలదే పైచేయి

- కనుల పండువగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం
- ఆద్యంతం ఉత్కంఠ రేపిన బన్ని ఉత్సవం
- రణరంగాన్ని తలపించిన జైత్రయాత్ర
- రక్త తర్పణం చేసిన కంఛాబీర వంశస్తుడు
- జిల్లా ఎస్పీ స్వీయ పర్యవేక్షణలో గట్టి బందోబస్తు
- కొండపై దాదాపు 2లక్షలకు పైగా భక్తులు



సింహాసన కట్టమీద అధిష్ఠించిన మాళమల్లేశ్వరుని ఉత్సవ మూర్తులు



మాళమల్లేశ్వరస్వామి జైత్రయాత్ర

గాల్లోకి లేస్తున్న దివిటీలు

ఉత్సవ విగ్రహాల పల్లకీని రక్షణతో ముందుకు తీసుకెళ్తూ...

కర్రల సమరం.. సంప్రదాయ విజయం!

దేవరగట్టు రణరంగాన్ని తలపించింది. కర్రలు కరాళనృత్యం చేయగా.. కాళరాత్రిలో దివిటీలు అగ్గి వర్షం కురిపించాయి. తలలు పగులుతున్నా.. రక్తం కారుతున్నా.. భక్తిభావం ఉప్పొంగింది. ఊళ్లకు ఊళ్లు సంప్రదాయాన్ని కాపాడుకునేందుకు కదిలిరాగా.. బన్ని ఉత్సవం భక్తజన సంద్రంగా మారింది. మాళ మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది.

హొళగుంద: జైత్రయాత్ర ఎప్పటిలానే ఉత్కంఠ రేపగా.. మొగలాయి సమరం యుద్ధ వాతావరణాన్ని తలపించింది. కల్యాణోత్సవానికి ముందు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మంగళవారం రాత్రి 11.30 గంటలకు డొళ్లిన బండ వద్దకు చేరుకు న్నారు. వర్గ వైషమ్యాలు, పాత కక్షలు, వ్యక్తిగత మన స్పర్థలను వీడి మూడు గ్రామాల ప్రజలు కలసిక ట్టుగా పండుగ జరుపుకుందామని పాల బాస తీసు కున్నారు. అనంతరం మూడు గ్రామాలకు చెందిన పెద్దలు కార్యక్రమానికి హాజరైన జిల్లా ఎస్పీ కృష్ణకాం త్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు బండా రాన్ని(పసుపు) ఇచ్చి మాళ మల్లే శ్వరుని కల్యాణానికి అనుమతి తీసుకున్నారు. మేళతాళాలు, డోలు వాయి ద్యాలు.. ఇనుప కడ్డీలు తొడిగిన కర్రలు.. అగ్గి కాగడాలు, దివిటీలతో కొండపైకి చేరిన గ్రామస్తులు మాళమ్మ, మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో కూడిన పల్లకీని ఊరేగింపుగా తీసుకొస్తున్న సమయంలో కొందరు భక్తులు అటకా యించారు. ఆ సమయంలో అగ్గి కాగడాలు విసురు కోవడంతో పాటు కర్రలతో కొట్టుకోవడం రణరం గాన్ని తలపించింది. డిర్ర్.. ర్ర్.. ర్ర్.. గోపరాక్ అం టూ విగ్రహాలను మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీదకు చేర్చారు.

రాక్షసులకు రక్తతర్పణం

జైత్రయాత్ర దట్టమైన అడవిలో సుమారు 6 కి.మీ దూరంలోని ముళ్లబండ, పాదాల గట్టు మీదుగా రాక్ష సపడి గుండు వద్దకు చేరుకుంది. భయంకరమైన వాతావరణంలో కంఛాబీర వంశానికి చెందిన గొరవయ్య బసవరాజు తన ఎడమ కాలు పిక్కల నుంచి దబ్బణం గుచ్చుకుని వచ్చిన రక్తాని మణి, మల్లాసురులుగా పిలిచే రాక్షస గుండ్లకు సమర్పిం చాడు. అక్కడి నుంచి ఉత్సవ విగ్రహాలను శమీ వృక్షం వద్దకు తీసుకెళ్లారు. ఉత్సవంలో పాల్గొన్న



దేవరగట్టులో కర్రల సమరం

ఫొటోలు : వడ్డే శ్రీనివాసులు

భక్తులు కర్రలు, మిగిలిన ఆయుధాలను అక్కడ ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలతో ఎదురు బసవన్న గుడి వైపునకు బయలుదేరారు. అక్కడ ఆలయ ప్రధాన పూజారి గిరిస్వామి భవిష్యవాణి(కార్ణీకం) వినిపించారు.

చెట్టు కొమ్మ విరిగిపడి ముగ్గురి మృతి

దేవరగట్టు బన్ని ఉత్సవాల్లో అపశృతి చోటు చేసుకుంది. జైత్రయాత్రకు ముందు బన్ని వేడుకను తిలకించేందుకు సింహాసన కట్ట సమీపంలోని సత్య నారాయణ కట్టపైనున్న రావి చెట్టుపై కూర్చున్న భక్తులు కొమ్మ విరిగి పడడంతో ముగ్గురు మృత్యు వాత పడ్డారు. వీరిలో ఆస్పరికి చెందిన మాల గణేష్(18), కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ప్రకాష్(30), ఆలూరు మండలం మొలగవల్లి కొట్టా లకు చెందిన రామాంజనేయులు(45) ఉన్నారు.

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

బన్ని ఉత్సవాల్లో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక నుం చి దాదాపు 2 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలు నిర్వహించే నెరణికి, నెర ణికి తండా, కొత్తపేట గ్రామస్తులతో పాటు దేవర గట్టు చుట్టుపక్క గ్రామాలైన నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం, ఎల్లార్తి, సుళువాయి, అరికెర, అరికె రతండా, కురుకుంద, లింగంపల్లి గ్రామాలకు చెం దిన భక్తులు ఉత్సవంలో పాల్గొని మొగలాయి ఆడారు. కర్రల సమరంలో 84 మందికి గాయాలు కాగా.. వీరిలో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. పలువురు భక్తులకు కాలిన గాయాలయ్యాయి. మం గళవారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వ రస్వామి జైత్రయాత్ర బుధవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది.

ఎస్పీ స్వీయ పర్యవేక్షణ

కర్రల సమరంలో రక్తపాతాన్ని తగ్గించేందుకు పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సుమారు 1100 మంది పోలీ సులతో స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. అల్లర్లకు పాల్పడే వారిని గుర్తించేందుకు డ్రోన్ కెమె రాలను వినియోగించారు. వందలాది సీసీ కెమె రాలు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు కం ట్రోల్ రూం నుంచి ప్రతి ఒక్కరి కదలికలను జల్లెడ పట్టారు. అదేవిధంగా దేవరగట్టు పరిసర గ్రామాల్లో 144 సెక్షన్‌ను అమలు చేశారు.

నేడు రథోత్సవం

దేవరగట్టులో గురువారం సాయంత్రం మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం ఘనంగా జరుగ నుంది. 27న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, సాయంత్రం వసంతోత్సవం, కంకణ విసర్జన, 28న మాళమ ల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

పంటలకు మంచి ధరలు



బన్ని ఉత్సవంలో భవిష్యవాణి భక్తుల్లో ఎంతో ఆసక్తి రేపుతోం ది. దేవరగట్టు ఆలయ ప్రధాన పూజారులుగా వ్యవహరించే కుటుం బీకుల్లో ఒకరైన గిరి స్వామి బుధవారం తెల్లవారుజామున జైత్రయాత్రలో భాగంగా ఎదురు బసవన్నగుడి పైకెక్కి డిర్ర్..ర్ర్.. గోపరక్ అంటూ కన్నడ భాషలో భవిష్యవాణి వినిపించారు. ''గంగాదేవి ఏటిపై నిలిచి నాలుగు దిక్కుల్లో వర్షాలు కురుపిస్తోంది. ఈ ఏడాది పత్తి ధర రూ.7,700, జొన్నలు రూ.4,700 పలుకుతాయి. పంట దిగుబడుల ధరలు పెరుగుతాయే కానీ తగ్గవు. ఈ ఏడాది ఒకే చోట కుంభవృష్టి కురువకుండా అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయి' అన్నారు.

సమష్టి కృషితో ఉత్సవాలు ప్రశాంతం



అన్ని శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులు, భక్తుల సహకారంతో దసరా బన్ని ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. గతంలో పోలిస్తే క్షత గాత్రుల సంఖ్య తగ్గింది. ఎంత చెప్పినా వినిపిం చుకోకుండా భక్తులు చెట్లు ఎక్కడం వల్లే ముగ్గురి మృతికి కారణమైంది. ప్రశాంత వాతావరణంలో బన్ని ఉత్సవం కొనసాగడం శుభపరిణామం.

– ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలులో ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివల్

- రాయలసీమ స్థాయిలో నవంబర్ 3,4,5 తేదీల్లో నిర్వహణ
- కలెక్టర్, జేసీ, ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పోస్టర్ల ఆవిష్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): పోషకాలకు నెలవైన చేపలు,రొ య్యల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా రాయల సీమ స్థాయిలో కర్నూలులో ప్రాన్స్ అండ్ ఫిష్ ఫెస్టివ ల్‌ను పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. నవంబరు 3,4,5 తేదీల్లో కర్నూలు బైపాస్‌లోని రావూరి గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్ర మానికి సంబంధించిన పోస్టర్లను బుధవారం జిల్లా కలెక్టర్ జి.సృజన, జేసీ నారాపురెడ్డి మౌర్య, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, కర్నూలు, కోడుమూరు ఎమ్మె



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ జి.సృజన

ల్యేలు హఫీజ్‌ఖాన్, సుధాకర్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా జిల్లా మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్యామల మాట్లాడుతూ... చేపలు, రొయ్యల్లో పోష కాలు పుష్కలంగా ఉన్నా... వినియోగం అంతంత మాత్రంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియో గాన్ని మరింత పెంచి ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వం మొట్ట మొదటిసారిగా రాయల సీమ స్థాయిలో కర్నూలులో ప్రాన్స్, ఫిష్ ఫెస్టివల్‌ను నిర్వహించేందుకు చర్యలు తీసుకుందని తెలిపారు. బైపాస్ రోడ్డులోని రావూరి గార్డెన్‌లో మూడు రోజుల పాటు రొయ్యలు, చేపల స్టాళ్లు, సెమినార్‌లు, కాన్ఫ రెన్స్‌లు, ఫుడ్ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో అధికారులు, ప్రజాప్రతినిధుల చేతులమీదు గా పోస్టర్లను విడుదల చేయించినట్లు పేర్కొన్నారు.

రూ.10 కోట్లతో వసతి గృహాల నిర్మాణం

- సమష్టి సహకారంతో దసరా ఉత్సవాలు విజయవంతం
- మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్, ఈఓ

మహానంది: భక్తుల సౌకర్యార్థం మహానందిలో రూ.పదికోట్లతో వసతిగృహాల నిర్మాణం చేపడుతు న్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వ రరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. దేవస్థానం కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమా వేశం నిర్వహించి మాట్లాడారు. తొమ్మిదిరోజుల పాటు జరిగిన దసరా ఉత్సవాలు విజయవంతమ య్యాయని తెలిపారు. ఉత్సవాల్లో విశేష పూజలకు ఎంతో మంది దాతలు సహకరించారన్నారు. రానున్న కార్తీక మాసంలోనూ క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడ తామన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ చంద్రశేఖర్ రెడ్డి

తో సూట్‌రూము, సాధారణ గదుల నిర్మాణానికి త్వర లోనే శ్రీకారం చుడతామన్నారు. కోనేరుల వద్ద స్నానాలు ఆచరించిన మహిళలు వస్త్రాలు మార్చుకు నేందుకు ప్రొద్దుటూరుకు చెందిన సీవీ సుబ్బారావు ప్రత్యేక షెడ్డును నిర్మించనున్నట్లు తెలిపారు.

దసరా ఆదాయం రూ. 39.73లక్షలు

మహానందిలో దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భం గా ఆర్జిత సేవాటికెట్లు, ప్రసాదాల విక్రయం, వసతి విభాగాలు ఇతర వాటి ద్వారా తొమ్మిరోజులకు రూ. 39, 73, 575 వచ్చినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు. గత ఏడాది రూ. 29, 59, 475 వచ్చిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ. 10,14,100 పెరిగినట్లు వెల్లడించారు. సమావేశంలో ఆలయ వేద పండితులు, ప్రధానార్చకులు పాల్గొన్నారు.

వైభవంగా ఉగ్ర నరసింహుడి పవిత్రోత్సవం



పవిత్ర హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ: ఎగువ అహోబిలం శ్రీజ్వాలానరసింహ స్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగ రంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారు జామున నిత్య పూజల అనంతరం మూల విరాట్ ఉగ్రనరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవా ర్లకు పవిత్ర మాలలను ధరింపజేశారు. ఉత్సవ మూర్తులైన స్వామి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ఠ, కుంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పవిత్ర హోమం నిర్వహించారు. రాత్రి ఉభయదేవేరులతో ఉగ్రనరసింహస్వామి ఉత్సవ పల్లకీని అధిష్ఠించి మాడ వీధుల్లో ఊరేగారు.

నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం

పవిత్రోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులకు నిర్వహించిన స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ల,



పవిత్ర మాలలు ధరించి ఉభయదేవేరులతో కొలువైన ఉగ్రనరసింహస్వామి

పసుపు, చందనం, గంధంతో పండితులు ఈ కార్య క్రమం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హోమం నిర్వహించి మంగళ హారతి, తీర్థప్ర సాద గోష్ఠి వితరణతో మొదటి రోజు కార్యక్రమాన్ని ముగించారు. పవిత్రోత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

క్లుప్తంగా

మల్లన్న సేవలో కేంద్ర మంత్రి



రాజగోపురం వద్ద కేంద్ర మంత్రికి ఆహ్వానం పలుకుతున్న ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను బుధవారం రాత్రి కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ భాఘే ల్ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద ఆలయాధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

చాగలమర్రి: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని చింతలచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాలు.. చింతలచెరువు గ్రామానికి చెందిన చంద్రశేఖర్(29)కు కొలిమిగుండ్ల మండలం కోటపాడుకు చెందిన సుజాతకు 8 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కూతురు సంతానం. రెండు నెలల క్రితం భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో భార్య పుట్టినింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ ఈనెల 24న సాయంత్రం పురుగు మందు తాగి అపస్మారకస్థితిలో పడివుండగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడి తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుత్తి- కౌతాళం రోడ్డుకు జాతీయ హోదా

కర్నూలు (న్యూసిటీ): ఏపీలో 11 రహదారులను జాతీయ రహదారులు (ఎన్‌హెచ్)గా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో 20 రహదారులను ఎన్‌హెచ్‌లుగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖకు ప్రతిపాదించింది. ఈ మేరకు ఆ రహదారులను రెండు విడతల్లో ఎన్‌హెచ్‌లుగా ప్రకటించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. తొలి విడతలో అనంతపురం జిల్లా గుత్తి నుంచి కర్నూలు జిల్లా పత్తికొండ మీదుగా ఆదోని, కౌతాళం రోడ్డుకు జాతీయ హోదా కల్పించిందని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాదాపు 100 కిలో మీటర్లు మేర ఈ రహదారి విస్తరణ, అభివృద్ధికి నిధులు కేటాయించనుందన్నారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి ఎన్‌హెచ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

జనరిక్ మందులు భళే చౌక

- బ్రాండెడ్ కంటే 70 శాతం వరకు తక్కువ
- పెద్దాసుపత్రిలో 3 దుకాణాలు
- ప్రైవేటులోనూ 25కు పైగా దుకాణాలు
- కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రాయితీ
- ప్రోత్సహించని వైద్యులు
- ధనార్జనే వారి ధ్యేయం
- రోగులు అవగాహన పెంచుకోవాలి

➤ కర్నూలుకు చెందిన విజయ్‌కుమార్ ఇటీవల తనకొచ్చిన వ్యాధికి ఆపరేషన్ చేయించుకున్నారు. ఇందుకు గానూ ఏడాది పాటు మందులు వాడాల్సి ఉండటంతో ఆపరేషన్ చేసిన ఆసుపత్రిలోనే మందులు కొనగా రూ.3 వేలు బిల్లు అయ్యింది. మరుసటి నెల కూడా మందులు కొనాలని సిద్ధమవగా స్నేహితుని సలహాతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీవనధార మందుల దుకాణంలో కొనుగోలు చేయగా కేవలం రూ.900లకే మొత్తం మందులు వచ్చాయి.

➤ కోడుమూరుకు చెందిన శ్రీనివాసులుకు పక్షవాతం వచ్చింది. కర్నూలుకు వచ్చి గతంలో చికిత్స చేయించుకున్నాడు. డాక్టర్ రాసిచ్చిన మందులను సదరు వైద్యుని క్లినిక్‌లో తీసుకోగా రూ.2,500 అయ్యింది. మరుసటి నెల కూడా అవే మందులు కొనాలని భావించి కర్నూలుకు వచ్చాడు. తెలిసిన వారి సూచన మేరకు వాటిని జనరిక్ దుకాణంలో కొనుగోలు చేయగా కేవలం రూ.600 బిల్లు అయ్యింది.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీవనధార మందుల దుకాణం

బ్రాండెడ్, జనరిక్ మందుల ధరల్లో తేడా...

మందు పేరు	బ్రాండెడ్ ధర రూ.	జనరిక్ ధర రూ.
సిట్రిజిన్-10 మాత్రలు	28	3
సిఫిగ్జిమ్ 200 ఎంజి-10 మాత్రలు	200	40
మల్టీవిటమిన్- 10 మాత్రలు	220	50
పారాసిటమాల్ 500ఎంజీ- 10 మాత్రలు	20	4
మెట్‌ఫార్మిన్ 500 ఎంజి -10 మాత్రలు	30	4
టెల్మిస్టార్టిన్ 40ఎంజీ-10 మాత్రలు	80	25
పాంటాప్రోజోల్ క్యాప్సుల్-10 మాత్రలు	140	35
రోసువాస్టార్టిన్-20ఎంజీ-10 మాత్రలు	250	50
కాల్షియం మాత్రలు-10మాత్రలు	80	25
విటమిన్-డి 60కె-4 మాత్రలు	130	40

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా జనరిక్ మందుల దుకాణాలు పాతిక దాకా ఉన్నాయి. అందులో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనే మూడు దుకాణాలు ఉన్నాయి. బ్రాండెడ్ మందులతో పోలిస్తే వీటిలో మందులు అతి చౌకగా లభిస్తాయి. ఉదాహరణకు బ్రాండెడ్ మాత్రలు రూ.100 వస్తే జనరిక్ మందులు కేవలం రూ.25 నుంచి రూ.30 లభిస్తున్నాయి. దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇస్తోంది. దుకాణం ఏర్పాటు చేసుకున్న వారికి మందులను అందించే ఏజెన్సీలను సైతం చూపుతోంది. కర్నూలులో పెద్దాస్పత్రితో పాటు దాని ఎదురుగా ఒక దుకాణం, ఎన్‌ఆర్ పేట, పాతబస్టాండ్‌లలో దుకాణాలు ఉన్నాయి. వీటికి వైద్యుల నుంచి సరైన ప్రోత్సాహం ఉండటం లేదు. ఈ కారణంగా వీటి విక్రయాలు బాగా తక్కువగా ఉంటున్నాయి. తక్కువ ధరకు లభిస్తాయి కాబట్టి ఆ మందుల్లో నాణ్యత ఉండదని బ్రాండెడ్ మందులే కొనాలని కొందరు వైద్యులు ప్రచారం చేస్తున్నారు. వైద్యులు చెప్పిందే వేదంగా భావించి పలువురు రోగులు జనరిక్ మందులు కొనేందుకు ఇష్టపడటం లేదు. వ్యాధిని తగ్గించుకునేందుకు ఎంతైనా ఖర్చు పెట్టేందుకు వెనుకాడటం లేదు.

వైద్యులకు నజరానాలు

బ్రాండెడ్ కంపెనీల నుంచి వైద్యులకు నజరానాలు ముడుతున్నాయనేది బహిరంగ రహస్యం. గతంలో ఆయా కంపెనీలు వైద్యులకు అవసరమైన ఖరీదైన బహుమతులు ఇచ్చేవి. ఇందులో దుస్తులు, నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలు కూడా ఉండేవి. కానీ ఇప్పుడు తమకు వస్తువులు వద్దు నగదు కావాలని చెప్పి కొందరు వైద్యులు వసూలు చేస్తున్నారు. మరికొందరు విదేశీ ప్రయాణాలు, ఖరీదైన పుస్తకాలను తీసుకుంటున్నారు. బ్రాండెడ్ కంపెనీల మందులు రాస్తే ఇలాంటి బహుమతులు వైద్యులకు నిత్యం వస్తూనే ఉంటాయి. ఈ మేరకు ఆయా వైద్యులకు సదరు కంపెనీలు లక్ష్యాలు సైతం విధిస్తున్నాయి.

మరోవైపు భారతీయ వైద్య విధాన మండలి మాత్రం జనరిక్ పేరుతోనే వైద్యులు మందులు రాయాలని పలుమార్లు సూచన చేస్తోంది. ఇటీవల అది కచ్చితంగా అమలు కావాలని సైతం ఆదేశించింది. అయితే కొందరు వైద్యుల బృందం దీనిని వ్యతిరేకించి అమలు గాకుండా అడ్డుకుంది. 98 శాతం వైద్యులు జనరిక్ మందులు రాయడం లేదు.

మెడికల్ షాపులకే లాభం

కొన్ని ప్రముఖ కంపెనీలు బ్రాండెడ్ మందులతో పాటు కొన్ని జనరిక్ మందులను సైతం మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. వాటి ఎంఆర్‌పీల్లో మాత్రం కేవలం స్వల్ప తేడా కనపరుస్తున్నాయి. జనరిక్ మందులు రిటైలర్లకు మాత్రం చాలా తక్కువకు లభిస్తున్నాయి. ఉదాహరణకు ఒక మందు ఎంఆర్‌పీ రూ.100 ఉందనుకుంటే అది రిటైలర్‌కు రూ.25 నుంచి రూ.30లలోపు లభిస్తుంది. కానీ చాలా మంది రిటైలర్లు వాటిని ఎంఆర్‌పీకే విక్రయిస్తూ దోచుకుంటున్నారు. కొందరైతే రోగులను ఆకట్టుకోవడానికి తమ వద్ద కొనుగోలు చేస్తే మందులపై 20 నుంచి 40 శాతం డిస్కౌంట్ ఇస్తామని ప్రకటిస్తున్నారు. అలా గాకుండా కంపెనీలే ఎంఆర్‌పీ తగ్గించి ముద్రిస్తే రోగులకు కొనుగోలు చేయడానికి సులభంగా ఉంటుంది.

మందు ఒకటే.. ధరలే వేరు

బ్రాండెడ్, జనరిక్ మందుల్లో ఉండేది ఒకే రకమైన ఔషధమే. బ్రాండెడ్ మందులకు ఉత్పత్తి ఖర్చుతో పాటు డీలర్, హోల్‌సేల్, రిటైల్‌ల లాభాలు, వైద్యుల కమీషన్లు, మార్కెట్ చేయడం వంటి ఖర్చులన్నీ ఉంటాయి కాబట్టి వాటి ధర అధికం. ఉదాహరణకు డోలో 650 అనేది బ్రాండెడ్. అందులోని పారాసిటమాల్ అనేది దాని జనరిక్ పేరు. వైద్యులు పారాసిటమాల్ అని రాయాలి. కానీ అలా చేయడం లేదు. నోవామాక్స్ అనేది బ్రాండెడ్ కాగా అందులోని అమాక్సిలిన్ జనరిక్ మందు పేరు. అయితే కొన్ని ఫార్మాకంపెనీలు ఏది బ్రాండెడ్ మందో, ఏది జనరిక్ మందో తెలియనంతా మందులు తయారు చేస్తూ వైద్యులనే అయోమయానికి గురిచేస్తూ జనరిక్ పదాన్ని సామాన్యులకు అందకుండా చేస్తున్నాయి.

“ జనరిక్ మందులపై అనుమానాలొద్దు



జనరిక్ మందుల కంటే బ్రాండెడ్ మందులు మంచివనేది వాస్తవం కాదు. బ్రాండెడ్ కంపెనీల్లోగా జనరిక్ మందుల్లో కూడా అదే మందు ఉంటుంది. అందులోని నాణ్యతలో ఏ మాత్రం తేడా ఉండదు. ఈ విషయం మేము పలుమార్లు తనిఖీలకు వెళ్లి ల్యాబొరేటరీకి పంపి నిర్ధారించాం. బ్రాండెడ్ మందుల వలే జనరిక్ మందులకు మార్కెట్ ఉండదు కాబట్టి అవి ప్రజలకు తక్కువ ధరకు లభిస్తాయి. పేదరోగులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేస్తున్నాయి. వైద్యులు వీటిని రాస్తూ ప్రజలకు అధిక భారం గాకుండా చూడాలి. ఈ మేరకు జనరిక్ మందులను ప్రోత్సహించాలి. – ఎ.రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, కర్నూలు

కుమారుడిని కడతేర్చిన తండ్రి



చనిపోయిన శ్రీనివాసులు

వెలుగోడు: ఒక్కగానొక్క కుమారుడు కావడంతో తండ్రి అల్లారుముద్దుగా పెంచుకున్నాడు. డిగ్రీ వరకు చదివించాడు. ప్రయోజకుడవుతాడనుకుంటూ మద్యానికి బానిస అయ్యాడు. జులాయిగా తిరుగుతూ తరచూ ఇంట్లోవారితోనే గొడవ పడేవాడు. మద్యానికి డబ్బులివ్వాలని వేధించేవాడు. విసుగు చెందిన తండ్రే పెంచిన చేతులతోనే గొంతుకు టవాల్ బిగించి ఊపిరి తీశాడు. ఈ ఘటన వెలుగోడు పట్టణంలో చోటు చేసుకుంది. బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. వెలుగోడు పట్టణానికి చెందిన శిరివెళ్ల రామకృష్ణకు ఒక్కగానొక్క కుమారుడు శ్రీనివాసులు(35). రామకృష్ణ పట్టలు కుడుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుమారుడు శ్రీనివాసులును డిగ్రీ వరకు చదివించాడు. ఉద్యోగం రాకపోయినా ఏదైనా పని చేయాలని తండ్రి చెప్పినా వినకుండా జులాయిగా తిరిగేవాడు. ఈక్రమంలో మద్యానికి బానిస అయ్యాడు. మద్యానికి డబ్బు ఇవ్వాలని కుటుంబ సభ్యులను వేధింపులకు గురిచేసేవాడు. మంగళవారం తెల్లవారుజామున కూడా డబ్బు ఇవ్వాలని తండ్రితో గొడవపడ్డాడు. విసుగు చెందిన రామకృష్ణ కుమారుడి గొంతుకు టవల్ బిగించి గట్టిగా పట్టుకోవడంతో ఊపిరి ఆడక శ్రీనివాసులు మృతిచెందాడు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగభూషణం, ఎస్‌ఐ వెంకటప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన లారీ

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఐదు వాహనాలు పరస్పరం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. కర్నూలు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న ఓ లారీ పోతుదొడ్డి వద్దకు రాగానే టైర్ పంక్చర్ కావడంతో డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపేశాడు. వెనుక వస్తున్న మరో లారీని డ్రైవర్ అదుపు చేయలేక ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఇదే సమయంలో అటు వైపు వస్తున్న కారును డ్రైవర్ అదుపు చేయలేక డివైడర్‌పైకి ఎక్కించాడు. ఈ కారు వెనుకనే వస్తున్న లారీ డ్రైవర్ కారును తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఇదే సమయంలో మరో లారీ కూడా ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఒక దాని వెనుక వరుసగా ఐదు వాహనాలు ప్రమాదానికి గురైన ఘటన సినిమా స్టంట్‌ను తలపించింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం

పిల్లలు మత్తుకు బానిస అయితే ఎవరూ బాధ్యత వహిస్తారు
- బురాన్‌దొడ్డి-2 పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాల విక్రయంపై కలెక్టర్ సీరియస్
- కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫోన్‌లో ఆదేశాలు



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): సి. బెళగల్ మండలం బురాన్‌దొడ్డి-2 పాఠశాల ఆవరణలో మత్తు పదార్థాలు విక్రయించడంపై కలెక్టర్ డాక్టర్ జి.సృజన డీఈఓ, ఎంఈఓలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలిసినా బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఎలా అని మండిపడ్డారు. పిల్లలు మత్తుకు బానిస అయితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ నెల 16వ తేదీన బురాన్‌దొడ్డి-2 పాఠశాలల వద్ద మత్తు పదార్థాలు అమ్ముతున్న విషయాన్ని తానే గమనించానన్నారు. అయినా వారిపై చర్యలు తీసుకోలేదని, మీ పిల్లలు చదివే పాఠశాలల్లో పరిస్థితి ఇలాగే ఉంటే వదిలేస్తారా అని విద్యా శాఖాధికారులను ప్రశ్నించారు. వెంటనే ఆమె ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి మత్తు పదార్థాలు అమ్ముతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి బుధవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసులు పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు దుప్పట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఓ అప్పలకొండ, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, సమగ్ర శిక్ష ఏపీసీ వేణుగోపాల్, డీఈఓ రంగారెడ్డి, సెట్కూరు సీఈఓ రమణ పాల్గొన్నారు.

రీసర్వేలో పురోగతి సాధించాలి

కర్నూలు(సెంట్రల్): భూముల రీసర్వేలో పురోగతి సాధించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. బుధవారం సాయంత్రం ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్షించారు. జిల్లాలో 3,425 మంది రైతులకు 4,116 ఎకరాల భూమిని అసైన్ చేయడం కోసం అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలు పాటించి భూములు పొందడం కోసం లబ్ధిదారుల వివరాలను సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్ చేయాలని ఆమె అధికారులకు సూచించారు. జగనన్నకు చెబుదం-స్పందన కార్యక్రమంలో భాగంగా రెవెన్యూకు సంబంధించి 157 అర్జీలు ఇంతకుముందు వచ్చినవేనన్నారు. కర్నూలు రూరల్‌లో 18, ఆదోనిలో 5, ఆస్పరిలో 6, ఓర్వకల్లులో 12, గోనెగండ్లలో 9, హొళగుందలో 8, మద్దికెరలో 8, దేవనకొండలో 8 ఉన్నాయన్నారు. అర్జీదారులను పిలిపించుకుని వాటికి సంబంధించి పూర్తి వివరాలతో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. మూడో దశ భూముల రీసర్వేకు సంబంధించి ఇప్పటి వరకు మొదలు పెట్టని 23 గ్రామాల్లో వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, పత్తికొండ, కర్నూలు ఆర్‌డీఓలు రామలక్ష్మి, హరిప్రసాదులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్ ఏడీ మునీకన్నన్, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ నాగప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా నీటియాజమాన్య సంస్థ, నంద్యాల

పత్రిక ప్రకటన

జిల్లా నీటి యాజమాన్య సంస్థ, నంద్యాల నందు మస్టర్స్ మరియు యం.బుక్కులు సరఫరా చేయుటకు ఆసక్తి గల ముద్రణ సంస్థ నుండి సీల్డు టెండర్లు కోరడమైనది. పథక సంచాలకులు, డ్వామా, నంద్యాల వారి పేరుపై రూ. 1000/-లు విలువ గల డి.డి.ని కార్యాలయపు పనివేళల యందు తేది: 26.10.2023 నుండి 02.11.2023, మధ్యాహ్నము 12.00 గంటలలోపు సమర్పించి టెండర్ ఫారం పొందగలరు. మరియు తేది: 03.11.2023 మధ్యాహ్నం 12.00 గంటల వరకు సమర్పించగలరు. 04.11.2023 ఉదయం 10.00 గంటలకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ, నంద్యాల వారి కార్యాలయము నందు టెండర్లు తెరువబడును. ఇతర వివరముల కొరకు 79815 11282 ఫోన్ నెంబర్ ద్వారా పథక సంచాలకులు, డ్వామా, నంద్యాల కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- పథక సంచాలకులు, జిల్లా నీటియాజమాన్య సంస్థ, నంద్యాల

శంకర్‌నగర్‌లో చోరీ

ఆదోని అర్బన్: తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాలు.. పట్టణంలోని శంకర్ నగర్‌లో ఈశ్వర్, లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇంటికి తాళం వేసి దసరా సందర్భంగా హొళగుంద మండలం దేవరగట్టు బన్ని ఉత్సవానికి వెళ్లారు. అదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోపకలు ప్రవేశించి బీరువాలోని నగదు, బంగారం, వెండి ఆభరణాలు మూటకట్టుకుని ఉడాయించారు. బుధవారం ఉదయం యజమానికి ఇంటికి చేరుకుని చోరీ జరిగిందని నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.34 లక్షలు నగదు, రెండు జతల బంగారు కమ్మలు, 50 తులాల వెండి కడియాలు చోరీకి గురైనట్లు బాధితుడు ఈశ్వర్ వాపోయాడు. కాగా ఇదే విషయమై టూటౌన్ సీఐ శ్రీనివాస నాయక్‌ను వివరణ కోరగా తమకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పడం గమనార్హం.

గోసంరక్షణకు నూతన పాలక మండలి కృషి చేయాలి

- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- జిల్లా గోరక్షణ మహాసంఘం చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పి.ఆదిమోహన్‌రెడ్డి, సభ్యులు



గోశాల చైర్మన్‌గా ఆదిమోహన్‌రెడ్డి, సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): జిల్లా గోరక్షణ మహాసంఘం నూతన పాలక మండలి గో సంరక్షణకు కృషి చేయాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ కోరారు. బుధవారం గోశాలలో జిల్లా గోరక్షణ మహాసంఘం చైర్మన్‌గా ఎంపికైన పి.ఆదిమోహన్‌రెడ్డి, సభ్యులు భాస్కరరెడ్డి, శేషయ్య, శకుంతల, కవిత, పార్వతమ్మ, జవహర్‌లాల్‌ల చేత ఈఓ టి.అనుమంతరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నగరంలో కొన్ని పశువులు మేత లేక పోవడంతో ప్లాస్టిక్ కవర్లు తిని చనిపోతున్నాయని, అలాంటి పశువులను గుర్తించి గోశాలలో సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలో ప్రతి ఒక్కరికీ పదువులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. పార్టీకి సేవ చేసిన వారికి కచ్చితంగా ప్రజా సేవ చేసే అవకాశం వస్తుందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ గోవు సేవ చేయడానికి చైర్మన్, సభ్యులు ముందుండాలన్నారు. వారికి ఎలాంటి అండదండలు అందించేందుకైనా తాను సిద్ధంగా ఉంటానన్నారు. గోరక్షణ మహాసంఘం చైర్మన్‌గా ఎంపికైన పి.ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ గోశాల ఆస్తుల సంరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు. నగరంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించడం సంతోషంగా ఉందన్నారు. తనపై నమ్మకం ఉంచి గోరక్షణ మహాసంఘం చైర్మన్‌గా ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ఎం.సుభాష్‌చంద్రబోస్, కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ మేయర్ బంగి అనంతయ్య, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ REGULAR/DISTANCE/DISCONTINUED/FAILURES/DIRECT FINAL YEAR: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, BA, BCOM, BSC, MA, MCOM, MSC, BSW, BLIC, ANITHESIA, B.B.A, B.C.A, BED, MPED, LLB, MLT, DMLT, OT, MPHW, MBA, MCA, AGBSC, PHD, 8686172989. [L-798860]

REAL ESTATE

PLOT FOR SALE

LEASE/ RENT

■ 80 X 60 FEET 11 CENTS SITE, KURNOOL-HYDERABAD road NH7, OPP. ASHOK LEYLAND SHOW ROOM. WE WILL CONSTRUCT THE BUILDING AS PER TENANT REQUIREMENTS. CONTACT 9849290476. [C-1187945]

SERVICES

■ కంపెనీ ప్రొవైడ్ అన్ని రకముల బిజినెస్ ప్రాపర్టీ, పర్సనల్ అగ్రికల్చర్, టేకోవర్ కొరకు DSA & ఏజెంట్స్ కావలెను. Salary+Commission, 9990752820. [T-193]

BUSINESS OFFER

■ Swastika Services Pvt. Ltd. కంపెనీలో పనిచేయుటకు Male/Female ఏజెంట్స్ కావలెను. Qul: 10th Class, మంచి జీతం+ Incentives. సంప్ర: 8267820117. [T-1200098]

బంగారం కొనబడును

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-5947]

WANTED

■ ప్రముఖ వి9 న్యూస్ ఛానల్‌లో పని చేయుటకు యాంకర్స్, సబ్ఎడిటర్లు, వీడియో ఎడిటర్, రిసెప్షనిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్, రిపోర్టర్స్ కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. సం.ప్ర: 9490959794. [L-781073]

■ 1st Year Inter Maths (EM) బోధించుటకు Home Tutor కావలెను. సంప్ర: ఎ.క్యాంపు, Opp: మాంటిస్సోరి స్కూల్, కర్నూలు. సెల్: 98499 77577 [L-781075]

■ Wanted Sales and Marketing Managers candidates with Experience in Real Estate/ Banking/ Automobiles/ Insurance Sector will be preferred. Attractive Salary. Contact: Raaga Mayuri Builders Pvt. Ltd. Gayathri Estates, Kurnool. Cell: 99483 78610 [L-781074]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు వంట/ఇంటి పని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజ నం. జీ: 20K, ఫోన్: 8977839662, 8977839663 [HA-765]

■ కిడ్నీ,బ్రెయిన్ కాదు MP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ:15000-40000/-, ఫ్రీ రూమ్ + భోజనం. Hyd ఫోన్ : 7995365999 [HA-751]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]

■ JOB VACANCY: MAX PVT. LTD. Age: 18 to 45 yrs, Qul: 10th to Any Degree, Salary: 18000/- to 25000/- Contact: ✆ 7207833091. [T-764156]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి 94909 94349 94412 10725

రోడ్డు ప్రమాదంలో ప్లంబర్ మృతి



దేవరాజు మృతదేహం

కర్నూలు: నగర శివారులోని మామిదాల పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కర్నూలు బుధవారపేటకు చెందిన బొగ్గుల దేవరాజు (47) బుధవారం మృతి చెందారు. ఈయన ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మంగళవారం అదే కాలనీకి చెందిన రమేష్, ప్రసాద్, రామరాజులతో కలసి ఆటోడ్రైవర్ చంద్రను అద్దెకు మాట్లాడుకుని అలంపూర్‌కు వెళ్లి మద్యం తాగి తిరిగి వస్తుండగా మామిదాలపాడు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటోడ్రైవర్ చంద్ర సడన్ బ్రేక్ వేయడంతో ఆటోలో ఎడమ వైపు కూర్చున్న దేవరాజు కింద పడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య నాగమణితో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు కర్నూలు అర్బన్ తాలూకా ఎస్‌ఐ రఫిక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సాగునీరు



మాట్లాడుతున్న ఆయకట్టు రైతులు

కౌతాళం: పంటలు ఎండిపోకుండా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మాధవరం మేజర్ కాలువ కింద ఆయకట్టు భూములకు సాగునీరు అందుతోందని వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఆయకట్టు రైతులు స్పష్టం చేశారు. బుధవారం బంటకుంట సర్పంచ్ గోపాల్ రెడ్డి, మదిరె గ్రామ ఇన్‌చార్జ్ మల్లయ్య, ఆయకట్టు రైతులు మాట్లాడుతూ మాధవరం మేజర్ కాల్వ కింద ఉన్న బంటకుంట, సులేకేరి, మదిరె, పొదలకుంట, అగసలదిన్నె, కాత్రికి గ్రామాలకు సాగునీరు అందతున్నాయని, రైతులు వంతులవారీగా మాట్లాడుకుని పొలాలకు నీటి తడులు పెట్టుకుంటున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని తెలుగుదేశం నాయకులు తిక్కారెడ్డి చెప్పడం, ధర్నాలు చేస్తామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల డ్యాంలో నీరు సమృద్ధిగా లేకపోయినా, వచ్చే నీటి వాటాలోనే మండలానికి సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. మాధవరం మేజర్ కాలువకు 20 క్యూసెక్కుల నీటి వాటా ఉన్నా, ఎండుతున్న పంటలను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 20 క్యూసెక్కుల నీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారన్నారు. దీంతో పంట పొలాలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని చెప్పారు. మరో నాలుగు రోజుల్లో అన్నీ గ్రామాల్లో సాగుచేసిన పంటలకు కిందస్థాయిలో రైతులకు సాగునీరు అందుతుందన్నారు. నీటి వాటా విషయంలో ఎలాంటి భయాందోళన లేదని ఖరీఫ్ కింద సాగైన ప్రతి ఎకరాకు నీరు అందించే బాధ్యతను ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తన భుజాలపై వేసుకుని కృషి చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు ఇప్పటికైనా దుష్ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.